A1TV NEWS

APTEL 2023/16425

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంచిక :01 సంపుటి : 145 గురువారం 21 డిసెంబర్ 2023 పేజీలు 4. వేల :4 /



# ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేలా ఆడుదాం ఆంధ్ర

**. -ప్రతి ఏటా డిసెంబర్‌లో ఆడుదాం ఆంధ్రాను నిర్వహణ: సీఎం జగన్.**

**-ఏపీ నుంచి మరింతమంది పీవీ సింధులు, కిదాంబి శ్రీకాంత్‌లు, అంబటి రాయడులు తయారుకావాలనే లక్ష్యంతో ఆడుదాం ఆంధ్రా.**

ఆంధ్ర ప్రగతి తాడేపల్లి డిసెంబర్ 20: రాష్ట్రంలో మనుపెన్నడు జరగని క్రీడా సంబురాలను గ్రామ వార్డు సచివాలయాలనుంచి రాష్ట్ర స్థాయి క్రీడా వేదిక వరకు, యువతను క్రీడా రంగంలో సమున్నతంగా ప్రోత్సహిస్తూ మరింత మెరుగైన క్రీడా ప్రమాణాలను అందించేందుకు ఉద్దేశించిన క్రీడా మహోత్సవమైన ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేద్దామని సీఎం జగన్ యువతకు పిలుపునిచ్చారు. బుధవారం తాడేపల్లిలో క్యాంప్ కార్యలయంలో సీఎం జగన్ కలెక్టర్లతో 'ఆడుదాం ఆంధ్ర' సమీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో క్రీడా మంత్రి ఆర్కే రోజా, మంత్రి బొత్స సత్యనారాయణ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్(శ్యాప్) బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రభుత్వ కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, స్పోర్ట్స్ అథారిటీ వీసీ %డ% ఎండీ ధ్యానచంద్ర హెచ్‌ఎం తదితరులు పాల్గొన్నారు. అంతేకాకుండా ఈ సమావేశానికి ఆడుదాం ఆంధ్ర బ్రాండ్ అంబాసిడర్లు పీవీ సింధు, జ్యోతి సురేఖ, అంబటి రాయడు, కాదంబి శ్రీకాంత్, సాకేత్ మైనేని, షేక్ జాఫ్రిన్ హాజరు కావడం గమనార్హం. మరి ముఖ్యంగా చెన్నై సూపర్ కింగ్స్, ప్రైమ్ వాలీబాల్ మరియు ప్రో-కబ్బాడీ ప్రతినిధులు కూడా సమావేశంలో వర్చువల్ గా పాల్గొన్నారు.

**మిగతాది 2లో...**

# అంగన్వాడీలకు జగన్ సర్కార్ గుడ్ న్యూస్.



ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 20: ఏపీలో కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్న అంగన్ వాడీ హెల్పర్లు,వర్కర్లకు వైసీపీ సర్కార్ ఇవాళ గుడ్ న్యూస్ చెప్పింది. తాజాగా అంగీకరించిన రెండు కీలక డిమాండ్లకు సంబంధించి ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది.ఇందులో అంగన్ వాడీ హెల్పర్లను వర్కర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు వయో పరిమితి పెంపుతో పాటు మరో ఉత్తర్వు కూడా ఉంది. తాజాగా మంత్రుల కమిటీతో జరిపిన చర్చల మేరకు ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది.

ఏపీలో అంగన్ వాడీ హెల్పర్లకు అంగన్వాడీ వర్కర్లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు వయోపరిమితి పెంచుతూ ప్రభుత్వం ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఇకపై అంగన్ వాడీ హెల్పర్లకు అంగన్వాడీ వర్కర్లుగా ప్రమోషన్ ఇచ్చేందుకు ప్రస్తుతం ఉన్న వయో పరిమితిని 45 ఏళ్ల నుంచి 52 ఏళ్లకు ప్రభుత్వం పెంచింది. అలాగే అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లకు టీఏ, డీఏ లు చెల్లించేందుకు ఉద్దేశించిన మరో ఉత్తర్వు కూడా జారీ చేసింది. ఇటీవల మంత్రుల చర్చల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఈ రెండు ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో ఇప్పటికే పలు డిమాండ్ ల సాధన కోసం అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లు ఆందోళన చేస్తున్నారు. ఇవి తీవ్రతరం అవుతున్న క్రమంలో ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. మిగిలిన డిమాండ్లపైనా ప్రభుత్వం చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో అంగన్ వాడీ కేంద్రాలకు వేసిన తాళాలు పగులగొడుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతున్న నేపథ్యంలో సర్కార్ తాజా ఉత్తర్వులు ఊరటగా చెప్పుకోవచ్చు.

# ఏపీలో ఇక కురుక్షేత్రమే.. జగన్ ఓడిపోవడం ఖాయం

**- మాజీ సీఎం చంద్రబాబు.**





ఆంధ్ర ప్రగతి విజయనగరం డిసెంబర్ 20: సీఎం జగన్ పాలనలో అమరావతి పూర్తిగా నిర్వీర్యమైపోయిందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి విధ్యంసమైపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. 'యువగళం-నవశకం' సభ పేరు విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పోలిపల్లి ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగించారు.

నారా లోకేష్ చేసిన పాదయాత్రకు జగన్ సర్కారు అనేక అడ్డంకులు సృష్టించిందని చంద్రబాబు మండిపడ్డారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నో ఇబ్బందులు పెట్టారన్నారు. యువగళం వాలంటీర్లను జైలుకు పంపారన్నారు. తప్పకుండా వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని చంద్రబాబు హెచ్చరించారు. యువగళం.. ప్రజా గర్జనకు నాంది పలికిందన్నారు. ప్రజల్లో ఉండే బాధ, ఆక్రోశం, ఆగ్రహం యువగళంలో చూపించారన్నారు.


అధికార వైసీపీ నేతల కబ్జాలో ఉత్తరాంధ్ర నలిగిపోతోందన్నారు చంద్రబాబు. మెడపై కత్తి పెట్టి ఆస్తులు రాయించుకుంటున్నారని ఆరోపించారు. సమైక్యాంధ్ర పాలనలో కూడా ఇన్ని అరాచకాలు జరగలేదన్నారు. ఒకప్పుడు విశాఖపట్నం ఆర్థిక రాజధానిగా ఉండేదని.. ఇప్పుడు గంజాయి రాజదానిగా మారిందని ధ్వజమెత్తారు. ఉత్తరాంధ్రలో అభివృద్ధి ఆగిందన్నారు. జగన్ కు ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. విధ్వంస పాలనకు జగన్ నాంది పలికారని విమర్శించారు.

వైసీపీ పాలనలో కంపెనీలన్నీ పారిపోయాయని ఎద్దేవా చేశారు చంద్రబాబు. రుషికొండను బోడి గుండు చేసి.. సీఎం నివాసం కోసం రూ. 500 కోట్లతో విల్లా కట్టే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలో ఉండివుంటే 2020 నాటికి పోలవరం పూర్తి చేసేవాళ్లమన్నారు చంద్రబాబు. అబద్ధాల పునాదులపై నిర్మించిన పార్టీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అని.. వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్‌గా మారాలని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# పిల్లల ఉన్నత విద్య కోసం ఏ కుటుంబం అప్పుల పాలు కారాదన్నదే లక్ష్యం

**-సివిల్స్ ప్రిలిమినరీలో అర్హత సాధించిన 95 మందికి లక్ష చొప్పున ఆర్థిక తోడ్పాటు.**

**-గత ప్రభుత్వంలా మొక్కుబడి సాయం కాదు.. మన విద్యార్థులు పోటీ ప్రపంచంలో లీడర్స్‌గా ఎదిగేలా సాయం.**





ఆంధ్ర ప్రగతి తాడేపల్లి డిసెంబర్ 20: మన విద్యార్థులు పోటీ ప్రపంచంలో లీడర్స్‌గా ఎదగాలని, పిల్లల ఉన్నత చదువుల కోసం ఏ కుటుంబం అప్పుల పాలు కారాదని, అర్హత కలిగిన పేద విద్యార్థులు ధైర్యంగా విదేశాల్లో ఉన్నత విద్య చదివేలా మన ప్రభుత్వంలో 'జగనన్న విదేశీ విద్య' పథకాన్ని అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థుల చదువులకు ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటు అందిస్తోందని, ఈ పథకం వల్ల పలువురు విద్యార్థులు విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో చదువుతుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. పేద విద్యార్థుల తలరాత మార్చేందుకు రూ. 8 లక్షల వార్షికాదాయం లోపు ఉన్న వారందరికీ జగనన్న విదేశీ విద్యా దీవెన అందిస్తున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన నిధులను తాడేపల్లి క్యాంపు కార్యాలయం వేదికగా సీఎం జగన్ విడుదల చేశారు. అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.60 కోట్ల నిధులను నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. సివిల్స్ అభ్యర్థులకు జగనన్న ప్రోత్సాహకం అందిస్తున్నామన్నారు. సివిల్స్ ప్రిలిమ్స్ పాసైన అభ్యర్థులకు రూ.లక్ష ప్రోత్సాహకం, మెయిన్స్ పాస్ అయితే రూ.లక్షా 50 వేలు అందిస్తున్నామని వెల్లడించారు. సివిల్స్‌లో క్వాలిఫై అయిన 95 మందికి విద్యా దీవెన కింద ప్రోత్సాహకాన్ని అందించారు.

**మిగతాది 3లో...**

# ఉచిత ఇసుక పాలసీలో ముందస్తు బెయిల్ కోరిన చంద్రబాబు.

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 20: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఏపీ స్కిల్ డెవలప్మెంట్ స్కాములో అరెస్ట్ అయి జైలు నుంచి బెయిల్ మీద విడుదలైన సంగతి తెలిసిందే. అయితే తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇసుక అక్రమ రవాణా జరిగిందని, ఉచిత ఇసుక పాలసీ ద్వారా టీడీపీ నేతలు లబ్ధి పొందారని.. తద్వారా రాష్ట్ర ఖజానాకు తీవ్ర నష్టం వాటిల్లిందని పిటిషన్ వేశారు ఏపీ సీఐడీ అధికారులు. దీనిపై టీడీపీ అధినేత చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై ఏపీ హైకోర్టులో వాదనలు నేటితో ముగిశాయి. చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, సీఐడీ తరఫున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. గత రెండు నెలలుగా ఈ కేసు కోర్టులో వాయిదా పడుతూ వచ్చింది. అయితే ఈరోజు ఇరువైపులా పూర్తి వాదనలు విన్న ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.





# ఏపీలో ఫిబ్రవరి 10న ఎన్నికల షెడ్యూల్..?

ఆంధ్ర ప్రగతి అమరావతి డిసెంబర్ 20:

పార్లమెంట్ మరియు అసెంబ్లీ ఎన్నికలను ఒకేసారి నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఏపీలో వచ్చే ఫిబ్రవరి 10వ తేదీన ఎన్నికలకు షెడ్యూల్ కూడా విడుదల చేసే దిశగా ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేస్తోందని సమాచారం అందుతుంది.ఆ దిశగా ముహూర్తం కూడా ఖరారు అయినట్లు చెబుతున్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు సమాచారం కూడా వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.2019 సాధారణ ఎన్నికలకు సంబంధించి మార్చి మూడవ తేదీ కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. 2024 సంవత్సరంలో జరిగే సార్వత్రిక ఎన్నికలు గత ఎన్నికల కంటే 20 రోజులు ముందుగానే షెడ్యూల్ విడుదల అయ్యే అవకాశం ఉందని%ా% తెలుస్తోంది. అంటే ఫిబ్రవరి 10వ తేదీన ఆంధ్రప్రదేశ్ తో పాటు సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రిలీజ్ కానుంది అన్నమాట. ఇక ఎలక్షన్లు వస్తున్న నేపథ్యంలో వైసిపి పార్టీ ఇప్పటికే అభ్యర్థుల వేటలో పడింది. ప్రతిరోజు ఎమ్మెల్యేలతో సీఎం జగన్ సమావేశం అవుతూ కీలక చర్చలు చేస్తున్నారు. అటు టిడిపి మరియు జనసేన పార్టీల మధ్య పొత్తు కూడా దాదాపు ఖరారు అయిపోయింది.



# 36వ వార్డులో డా. వైయస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ చేపట్టిన కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి

**- పేదలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యం.- డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల ద్వారా 25 లక్షల వరకు ఉచిత వైద్య చికిత్స సేవలు**

**- అర్హులైన లబ్ధిదారులందరికీ డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ- దేశంలో ఏ రాష్ట్రంలో చేపట్టనటువంటి ఆరోగ్యశ్రీ వైద్య సేవలు జగనన్నతోనే సాధ్యం**

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
వైయస్సార్ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం అమలులో మరో మైలు రాయిని చేరుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగ్మోహన్రెడ్డి ప్రధానంగా విద్య, వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించి అనేక విప్లవత్మక సంస్కరణలు చేపడుతున్నారు, ఇందులో భాగంగా డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా సరికొత్తగా 25 లక్షల రూపాయల విలువైన వైద్య చికిత్సలను అందించేందుకు స్మార్ట్ కార్డులను లబ్ధిదారులకు అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా నంద్యాల పట్టణం 36వ వార్డులో కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి లబ్ధిదారులకు డా. వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి మున్సిపల్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డా. అంకిరెడ్డి వార్డు ఇన్చార్జి పూర్ణిమ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నాగిని రవి సింగారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి దేశంలోని ఏ రాష్ట్రంలో చేపట్టని అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని, ప్రధానంగా విద్యా, వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. వైద్య రంగంలో సరికొత్త విప్లవాత్మక మార్పులను తీసుకువస్తూ పేదలందరికీ నాణ్యమైన సురక్షితమైన వైద్యాన్ని, వైద్య సేవలను అందించేందుకుగాను సరికొత్తగా 25 లక్షల రూపాయల వరకు వివిధ వైద్య సేవలను అందించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ స్మార్ట్ కార్డులను అందజేయడమే కాకుండా లబ్ధిదారులకు అవసరమైన చికిత్సలను అందించేందుకు హాస్పిటల్స్ ను, వైద్యులను, వైద్య సిబ్బందిని అన్ని రకాల వైద్య సేవలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని దేశంలోని ఏ రాష్ట్రంలో చూడలేదని పేర్కొన్నారు. పేదలందరి ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ 25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలను ఈ ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డు ద్వారా పొందవచ్చన్నారు. ప్రజలు ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని గ్రహించాలని, ప్రజలు మంచి మనసుతో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేయడం జరుగుతుందని తెలిపారు. అర్హులైన వారు ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల కొరకు సచివాలయంలో సిబ్బందిని



సంప్రదించవచ్చన్నారు. సచివాలయ వాలంటీర్ల ద్వారా ప్రతి ఇంటికి డా. వైఎస్ఆర్ ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డులను అందజేయడం జరుగుతుందన్నారు. ఇటువంటి అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న వైఎస్ఆర్ ప్రభుత్వానికి ప్రజలు మద్దతు పలకాలని, రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు వైసిపి నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు

# దూరవిద్యా పరీక్షలు ప్రభుత్వ కళాశాలలో మాత్రమే నిర్వహించాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
జనవరి నెలలో ఉమ్మడి నంద్యాల, కర్నూలు జిల్లాలలో జరగబోవు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్య పరీక్షలను ప్రైవేట్ కాలేజీల కేంద్రాలలో నిర్వహించకుండా వాటిని రద్దు చేసి , ఉమ్మడి నంద్యాల , కర్నూలు జిల్లాలలోని ప్రభుత్వ డిగ్రీ , జూనియర్ , మహిళా కాలేజీలలో నిర్వహించి విద్యార్థుల , యువత భవిష్యత్తును కాపాడాలని రాయలసీమ విద్యార్థి , యువజన సంఘాల జేఏసీ చైర్మన్ రామినేని రాజునాయుడు , కన్వీనర్ శేక్ రియాజ్ , అబ్దుల్ ఖాధర్ లు ఏ.ఎన్.యూ అధికారులను , వీసీని కోరారు.బుధవారం నాడు నంద్యాల టౌన్ లోని జేఏసీ కార్యాలయంలో వారు పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు.
ఈ సందర్భంగా జేఏసీ నేతలు రామినేని రాజునాయుడు , శేక్ రియాజ్ , అబ్దుల్ ఖాధర్ లు మాట్లాడుతూ... గతంలో ఏ.ఎన్.యూ దూరవిద్య పరీక్షలు జరిగిన సందర్భంలో ఉమ్మడి నంద్యాల , కర్నూలు జిల్లాలలోని అన్ని ప్రైవేట్ కేంద్రాల నిర్వాహకులు విద్యార్థులు , యువత నుండి వారిని మభ్యపెట్టి యూనివర్సిటీ ఫీజులు – పరీక్ష ఫీజులు కాకుండా , రకరకాల పేర్లతో 15వేల నుండి 30వేల రూపాయలు వసూళ్లు చేసుకొని జేబులు నింపుకున్నారనీ వారు మండిపడ్డారు.
అలాగే కొంతమంది ఈ ప్రైవేట్ దూరవిద్య సెంటర్లలో పరీక్ష ఫీజులు చెల్లించి , యాజమాన్యానికి భారీ ముడుపులు చెల్లించి వారు పరీక్షలు వ్రాయకుండా ఇతరులతో (బై క్యాండెట్లు) పరీక్షలు వ్రాసిన ఉదంతాలు ఎన్నో కోకొల్లలుగా జరిగాయన్నారు.
కొంతమంది ప్రైవేట్ సెంటర్ల యాజమాన్యం ఈ పరీక్షలను పరీక్షలుగా కాకుండా – వ్యాపార పంథాలో చూస్తూ లక్షల రూపాయలు వసూళ్లు చేస్తూ విద్యార్థులను – నిరుద్యోగులను తీవ్ర మోసం చేస్తున్నారని వారు మండిపడ్డారు.



అందువలన తక్షణమే నంద్యాల , కర్నూలు జిల్లాలలోని జనవరిలో జరిగే ఎ.ఎన్.యూ దూరవిద్య పరీక్షలకు ప్రైవేట్ సెంటర్లను ఎత్తివేసి ప్రభుత్వ కళాశాలలో నిర్వహించి , విద్యార్థులు – యువత – నిరుద్యోగుల జీవితాలను కాపాడాలని వారు కోరారు. లేదంటే విద్యార్థులను , యువతను , నిరుద్యోగులను సమీకరించి ఛలో ఏ.ఎన్.యూ ముట్టడికి పిలుపునిస్తామని వారు తెలిపారు

# 2024 ఎన్నికలకు సన్నద్ధం కావాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపు

**-జై. లక్ష్మీ నరసింహ యాదవ్ కాంగ్రెస్ నంద్యాల నంద్యాల జిల్లా పార్లమెంట్ డిసిసి అధ్యక్షులు.**

**కాంగ్రెస్ వాదుల్లారా రండి తిరిగి రండి దేశంలో రాహుల్ గాంధీ ని ప్రధాని చేద్దాం.**

**-2024 దేశములో మరియు ఏపీలో అధికారంలోకి వస్తాం.**

**-ఆంధ్రప్రదేశ్ కు పునర్విభజన చట్టంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం.**

**-దేశంలో మతోన్మాద బిజెపిని ,రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేయండి.**

**-దేశంలో రిజర్వేషన్లు తీసేయాలనే కుట్రతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ న్నారు.**

ఆంధ్ర ప్రగతి ప్యాపిలి డిసెంబర్ 20:
డోన్ నియోజకవర్గం ప్యాపిలి పట్టణములో ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ కార్యక్రమానికి కాంగ్రెస్ నంద్యాల పార్లమెంట్ జిల్లా డీసీసీ అధ్యక్షులు జె. లక్ష్మీ నరసింహ యాదవ్,డోన్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి స్వామిగారు పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో దేశములో మరియు ఆంధ్ర ప్రదేశ్ లోనూ ఇందిరమ్మ రాజ్యమే వస్తుందని,మొన్న కర్ణాటక నిన్నతెలంగాణ రేపు ఆంధ్ర ప్రదేశ్ లలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రానుందనేదే తమ నినాదం అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారం చేపట్టిందన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వచ్చిన వెంటనే రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీల అమలు ,రైతులకు 3 లక్షల వరకు రుణమాఫీ,వంటగ్యాస్ సిలిండర్ 500 కు ఇస్తాం, ప్రతి సంవత్సరం ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ,మొదలైన అంశాల మేనిఫెస్టో తోప్రజల్లోకి వస్తున్నామని వారు వివరించారు.
మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి అని ప్రజల్లో మార్పు మొదలైంది అన్నారు. కాంగ్రెస్ వాదుల్లారా రండి తిరిగి రండి దేశంలో రాహుల్ గాంధీ ప్రధాని కావాలనే కృత నిశ్చయంతో కాంగ్రెస్ పార్టీ విజయానికి మనందరం సారదులుగా వ్యవహరించాలన్నారు. పాత కాంగ్రెస్ నాయకులు తిరిగి సొంతగూటికి రావాలని వారు పిలుపునిచ్చారు, పునర్విభజన చట్టంలో ఉన్న హామీలను సైతం నెరవేర్చకుండా తుంగలో తొక్కి ఆంధ్ర ప్రజలను దారుణంగా మోసగించిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఇంటికి పంపాలని , దేశంలో రిజర్వేషన్లు తీసేయాలనే కుట్రతో ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ, బడుగు బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేస్తున్నారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి, డోన్ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గార్లపాటి మద్దులేటి స్వామి , జిల్లా ఉపాధ్యక్షులు ఉన్నిగోర్ల జనార్ధన్ , బోయ రమణ , డిసిసి ప్రధానకార్యదర్శి మోరిమి శెట్టి సునీత,జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు పఠాన్ హబిబ్ ఖాన్ , ప్యాపిలి మండల అధ్యక్షులు ఎమ్.నాగసుబ్బయ్య,రాష్ట్ర బీసీ సెల్ కో ఆర్డినేటర్ ఉన్నిగోర్ల రామ్ భూపాల్ యాదవ్ , యస్ లక్ష్మన్న రాష్ట్ర సోషల్ మీడియా కో



ఆర్డినేటర్,బిసి సెల్ అధ్యక్షుడు ఎస్. మహేంద్ర నాయుడు, ఎస్సి సెల్ అధ్యక్షుడు ఆర్.మల్లికార్జున,జలదుర్గం గ్రామ అధ్యక్షుడు సి.నాగరాజు, ప్యాపిలి మండల ప్రధాన కార్యదర్శి లోకనాథ్, ఖాజా హుస్సేన్ , మధుసూదన్ రెడ్డి , షబ్బీర్ , వీరజు , మిగతా కాంగ్రెస్ అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు .





# మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భోజన పాకెట్స్ పంపిణీ.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త సోదరుడు సునీల్ కుమార్ లావణ్య ల కుమార్తె లిమహీరలిజన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక రైల్వే స్టేషన్ ప్రాంతంలో 150 మంది బాటసారులకు,యాచకులకు భోజన పాకెట్స్ పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి బింగుమళ్ళ శ్యామ్ సుందర్ గుప్త,ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ పొలిటికల్ వైస్ చైర్మన్ కౌన్సిలర్ కండె శ్యామ్ సుందర్ లాల్,నంద్యాల మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తొమ్మంద్ర నాగరాజు, ప్రధాన కార్యదర్శి మలిపెద్ది నాగరాజు,కోశాధికారి ఇల్లూరు రామకృష్ణ,కార్యదర్శి శివశంకర్,సుబ్బారావు, శివ,రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేలా ఆడుదాం ఆంధ్ర

వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం డిసెంబర్లో నిర్వహించాలని యోచిస్తోందని సీఎం జగన్ తెలిపారు. ముమ్ముందు ఆడుడం ఆంధ్రను శాశ్వత కార్యక్రమంగా చేస్తామని, ప్రతి సంవత్సరం డిసెంబర్లో నిర్వహిస్తామని తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని పెంపొందించటంలో, ప్రతి వ్యక్తి ఫిట్గా, చురుకుగా ఉండటంలో క్రీడల ప్రాముఖ్యతను అందరం తెలుసుకోవాలని సీఎం నొక్కి చెప్పాడు. క్రమశిక్షణ, అంకితభావం, క్రీడాస్ఫూర్తి వంటి సాఫ్ట్ స్కిల్స్ నేర్పేందుకు క్రీడలు దోహదపడతాయని అన్నారు.
ఏపీకి చెందిన ప్రముఖ క్రీడాకారులతో సీఎం జగన్ మాట్లాడుతూ 'ఆడుదాం ఆంధ్రా వెనుక ఉన్న లక్ష్యం మరెన్నో పీవీ సింధు(లు), కిదాంబి శ్రీకాంత్(లు) రావాలి, అంబటి రాయడు(లు) వంటి వాడు ఆంధ్ర ప్రదేశ్ నుండి ఉద్భవించనున్నారు" అని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు.
ఆడుదాం ఆంధ్ర కోసం 1.19 కోట్లకు పైగా రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆడుడం ఆంధ్రా క్రీడా పండుగను మెగా-హిట్గా మార్చడానికి సన్నద్ధమవుతోందని పేర్కొన్నారు.దిగ్గజ చెన్నై సూపర్ కింగ్స్, ప్రో-కబడ్డీ మరియు ప్రైమ్ వాలీబాల్, పీవీ సింధు, శ్రీకాంత్ కిదాంబితో సహా క్రీడా ఫ్రాంచైజీలతో రాష్ట్ర ప్రభుత్వం విజయవంతంగా సహకారాన్ని ఏర్పరచుకుందని తెలిపారు. అదనంగా, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, ఆంధ్రా ఖో-ఖో అసోసియేషన్, ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్, ఆంధ్రా వాలీబాల్ అసోసియేషన్ కూడా రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారుల కోసం వేతుకుతున్నారని అన్నారు.
ఇంతటి గొప్ప భాగస్వామ్యం మన రాశ్ట్రంలోని అట్టడుగు స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి అసమానమైన జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపును, అవకాశాలను అందించటమే లక్ష్యంగా పెట్టుకున్నాని తెలిపారు.
ప్రతి సంస్థ నుండి ఫ్రాంచైజీ ప్రతినిధులు నియోజకవర్గం నుండి రాష్ట్ర స్థాయి వరకు జరిగే మ్యాచ్లను నిశితంగా పర్యవేక్షిస్తారు. అసాధారణమైన నైపుణ్యాలను ప్రదర్శించేవారిని, నిజమైన క్రీడాస్ఫూర్తి కలిగి ఉన్నవారిని, అట్టడుగున ఉన్న ప్రతిభావంతుల కోసం వారు చురుకుగా వెలికితీసే లక్ష్యంగా పని చేయబోతున్నారు. టాలెంట్ సెర్చ్ ఇనిషియేటివ్ని మెరుగుపరచడానికి, ఆంధ్రప్రదేశ్కి చెందిన ఆడుదం ఆంధ్రా బ్రాండ్ అంబాసిడర్లు, ప్రసిద్ధ బ్యాడ్మింటన్ క్రీడాకారులు శ్రీకాంత్ కిదాంబి, పీవీ సింధు కూడా అసాధారణమైన బ్యాడ్మింటన్ క్రీడాకారులను గుర్తించి వారిని ఎదుగుదలకు సాయం చేయనున్నారు.
మూల్యాంకన ప్రక్రియ పూర్తయిన తర్వాత, ఎంపికైన అథ్లెట్లు క్రీడల్లో కెరీర్ను నిర్మించుకోవడంలో వారికి వివిధ అంశాలలో రాష్ట్ర ప్రభుత్వం నుండి సమగ్ర మద్దతును అందజేస్తారు. అడ్మిషన్ మరియు రిజిస్ట్రేషన్ ప్రాసెస్లలో సహాయం, ప్రొఫెషనల్ స్పోర్ట్స్ ట్రైనింగ్కు యాక్సెస్ మరియు ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ అకాడమీలలో చేరడానికి అవకాశాలను అందించడం నుండి, ప్రభుత్వం ఎంపిక చేసిన అభ్యర్థులను అంతటా నిర్వహిస్తుంది.
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా మహెూత్సవానికి యువ ఔత్సాహికుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రభుత్వం స్పోర్ట్స్ ఫెస్టివల్ కోసం రిజిస్ట్రేషన్ వ్యవధిని పొడిగించినందున, ఈ రోజు వరకు రిజిస్ట్రేషన్ కౌంట్ 1.19 కోట్లకు పెరిగింది, ఇది ఈవెంట్ కోసం విపరీతమైన ఆసక్తిని మరియు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తుంది. స్పోర్ట్స్ ఫ్రాంచైజీల అదనపు ప్రకటనతో ప్రతిభావంతుల కోసం చురుగ్గా స్కౌటింగ్ చేయడంతో, ఔత్సాహిక యువ క్రీడాకారులు ఆంధ్రప్రదేశ్లో మొట్టమొదటి క్రీడా ఉత్సవంలో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించబడ్డారు.

## రామనాథ్ థియేటర్ యజమాని పుల్లారెడ్డిని ఘనంగా సన్మానించిన బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు.






ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
నంద్యాల పట్టణంలోని రామనాథ్ థియేటర్ యజమాని పుల్లారెడ్డిని నంద్యాల జిల్లా నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని రామనాథ్ థియేటర్ నందు నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ, వీర సింహారెడ్డి, భగవాన్ కేసరి చిత్రాలు వరుసగా అద్భుతమైన విజయాన్ని సాధించి ఈ థియేటర్ నందు పై మూడు చిత్రాలు 50 రోజులను పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా నంద్యాల జిల్లా నందమూరి అభిమాన సంఘం నాయకులు థియేటర్ యజమాని పుల్లారెడ్డి కి శాలువా పూలమాలతో సత్కరించిన అనంతరం మెమొంటోను అందజేసి అభినందనలు తెలిపారు. అనంతరం రామనాథ్ థియేటర్ నందు పనిచేస్తున్న వారికి నిత్యవసరకులతోపాటు బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు లెజెండ్ బాలు, సుదర్శన్, మాలిక్ భాష, ఆనంద్, శంకర్ రెడ్డి, బుజ్జి, హనుమాన్, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.




# పిల్లల ఉన్నత విద్య కోసం ఏ కుటుంబం అప్పుల పాలు కారాదన్నదే లక్ష్యం-సీఎం జగన్.

తల్లిదండ్రులు ఎలాంటి అప్పులు చేయాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం, జగనన్న తోడుగా ఉంటుందన్న భరోసా ఈ కార్యక్రమం ద్వారా ఇస్తున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. శాచురేషన్ పద్ధతిలో పారదర్శకంగా ఎవరికైనా కూడా టైమ్స్ రేటింగ్, టైమ్స్ హైయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాంకింగ్స్‌లో కానీ, క్యూఎస్ ర్యాంకింగ్స్‌లో టాప్ 50 కాలేజీల్లో 350 కాలేజీల్లో సీట్లు ఎవరికి వచ్చినా కూడా ఏపీ నుంచి ఎంటైర్ ఫీజు కోటి 25 లక్షల దాకా ఇచ్చి తోడుగా నిలబడే కార్యక్రమం ఇదని తెలిపారు.
ఈ ఏడాది దాదాపుగా 51 మందికి కొత్తగా అడ్మిషన్లు వచ్చాయని, రూ.9.50 కోట్లు వారికి ఇస్తున్నామని, విదేశాల్లో ఉన్నత విద్య కోసం ఇప్పటికే చదువుతున్న పిల్లలకు ఈ సీజన్‌లో ఫీజులు చెల్లించాల్సిన మొత్తం రూ.41.59 కోట్లు నేడు ఇస్తున్నామని తెలిపారు. "దాదాపుగా రూ. 107 కోట్లు 408 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా ఖర్చు చేస్తున్నాం. ఈ పథకం ఎంత సంతృప్తి ఇస్తుందంటే..మిమ్మల్ని చూసి మిగిలిన వారు కూడా ఇన్‌స్పైర్ అయి టాప్ యూనివర్సిటీల్లో సీట్లు తెచ్చుకునేలా, మీరు గొప్పగా ఎదిగే దాకా రాష్ట్ర ప్రభుత్వం నుంచి మీకు అందించిందో అది ఎక్కడో ఒక చోట మన రాష్ట్రానికి కూడా కొంత కాంట్రిబ్యూషన్ ఇచ్చి రాష్ట్రాన్ని గుర్తు పెట్టుకోవాలి. మన పిల్లలకు మేలు చేయాలన్నదే నా కోరిక" అని సీఎం జగన్ ఆకాంక్షించారు.
రూప అనే విద్యార్థినికి రూ.89 లక్షలు, సాంబశివుడికి రూ.89 లక్షలు, కొలంబియా యూనివర్సిటీ న్యూయర్స్‌లో పకీర్ ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఆయనకు రూ.78 లక్షలు. మరియం రూ.67 లక్షలు ఫీజులు ఉన్నాయని, సీటు వచ్చినా కూడా అక్కడికి వెళ్లి చదవడానికి ఈ ఫీజులు ఉన్నాయని, అక్కడికి వెళ్లి చదవాలంటే ఎంత అప్పులు చేయాలని తల్లిదండ్రులు సంశయం చెందుతున్నారని అన్నారు. అటువంటి పరిస్థితులను మార్చుతూ..ప్రభుత్వం అండగా నిలిచిందని పేర్కొన్నారు.
"వార్షిక ఆదాయం రూ.8 లక్షలు ఉన్న కుటుంబాలకు ఈ పథకం దేవుడిచ్చిన గొప్ప అవకాశం. మీ అందరికీ కూడా ఆల్ ది బెస్ట్ విసెస్ తెలియజేస్తూ మీరందరూ అత్యధికంగా బాగుపడాలని కోరుకుంటున్నాను. రాబోయే రోజుల్లో ఇంకా ఎక్కువ మంది ఉత్తీర్ణులై మన రాష్ట్రం పేరును, వారి కుటుంబాలను ఈ స్థాయి నుంచి మరో స్థాయిలోకి తీసుకెళ్లే పరిస్థితి రావాలని, దేవుడు ఇంకా ఇలాంటి కార్యక్రమాలు చేపట్టే పరిస్థితి రావాలని కోరుకుంటున్నాను" అని సీం అన్నారు.
మన దేశంలో ఎక్కడైనా కూడా ఉత్తీర్ణత సాధించిన వారు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎన్నికైన వారిని కూడా ప్రోత్సహించేందుకు ఈ రోజు మరో కార్యక్రమం ప్రారంభిస్తున్నామని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రిలీమ్స్ పాసైన వారేవరైన వారికి లక్ష రూపాయల ప్రోత్సాహకం, ప్రిలీమ్స్ నుంచి మెయిన్స్‌కు ఎంపికైతే మరో రూ.50 వేలు కలిసి రూ.1.50 ఇస్తామని సీఎం ప్రకటించారు. ఎన్నిసార్లు పరీక్షలు రాసినా కూడా ఈ ప్రోత్సాహకం ఉంటుందని తెలిపారు. ఇంకా ఎక్కువ మంది ఐఏఎస్‌లు, ఐపీఎస్ చదువులను ప్రోత్సహించే కార్యక్రమం మొదలుపెడుతున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ఈ రెండో కార్యక్రమం ద్వారా దాదాపుగా 95 మంది విద్యార్థులు ప్రిలీమ్స్‌కు చేరారని, వీరిలో 11 మంది మెయిన్స్‌కు ఎంపికయ్యారని, వీరికి ఇవాళ ప్రోత్సాహకం అందజేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వంలో ఎక్కడా కూడా శాచురేషన్, పారదర్శకత అన్నది ప్రజల ముందుర ఉంచుతున్నామని, ఎవరికి రెకమెండేషన్లు అవసరం లేదని, ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, మీరు క్వాలిఫై అయి అప్లికేషన్ పెట్టుకుంటే మనందరి ప్రభుత్వంలో మీకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు

# తుగ్గలి మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని బిజెపి డిమాండ్.

### -పత్తికొండ నియోజకవర్గ కన్వీనర్ రంజిత్ కర్ణి.

ఆంధ్ర ప్రగతి తుగ్గలి డిసెంబర్ 20:



తుగ్గలి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని బిజెపి నాయకులు పత్తికొండకు విచ్చేసినటువంటి కర్నూలు జిల్లా కలెక్టర్ డా.జి.శ్రీజనని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి పత్తికొండ అసెంబ్లీ కన్వీనర్ రంజిత్ కర్ణి మాట్లాడుతూ, కర్నూలు జిల్లా ఈ ఏడాది కరువుతో అల్లాడిపోతుంది. ఫలితంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. 4 లక్షల 11 వేల ఎకరాల్లో వేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వరి, పత్తి, టమోట, వేరు శనగ, కంది లాంటి అత్యదిక సాగు చేసే పంటల రైతాంగం తీవ్ర నష్టాలల్లో కూరుకుపోయారు. ఖరీఫ్ లో రైతులు కోట్లాది రూపాయిల పంట నష్టపోయారు. ఈ కాస్త పరిస్తితుల్లో రైతన్నలను ఆదుకునేందుకు జిల్లలోని 24 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రభుత్వం ప్రకటించింది.తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఈ ఏడాది తుగ్గలి మండలం రైతులు సాగు చేసిన పంటలు పండక పంట పోలాలన్ని ఏడారి ప్రాంతాలుగా మారిపోవడంతో కరువు విలయతాండవం చేస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో, తుగ్గలి మండలాన్ని కూడా కరువు ప్రాంతాంగా ప్రకటించి రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో బిజెపి తుగ్గలి మండలాధ్యక్షులు లక్ష్మణ స్వామి, పత్తికొండ మండలాధ్యక్షుడు శంకరయ్య ఆచారి, దండి మల్లికార్జున, పూన మల్లికార్జున, రామాంజినేయులు, నరేష్, భాస్కర్, నాగ, రాంపల్లి సురేంద్ర, కురువ చంద్ర, చంద్ర శేఖర్, సూర్య, శ్రీధర్ గౌడ్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయండి.

### -జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
జిల్లాలో కుష్టు వ్యాధి అనుమానిత కేసుల గుర్తింపుకు ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన ఛాంబర్ లో కుష్టు వ్యాధి అవగాహన గోడపత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా జిల్లాలో కుష్టు రోగుల గుర్తింపు కార్యక్రమం పటిష్టంగా చేపట్టాలన్నారు. ఈనెల 27 నుంచి జనవరి 12 వ తేదీ వరకు జిల్లాలో నిర్వహించనున్న ఇంటింటా కుష్టు వ్యాధి గుర్తింపులో భాగంగా సర్వేకు సంబంధించిన పనులను ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు బృందాలుగా ఏర్పాటై వాలంటీర్లను అనుసంధానం చేసుకొని అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టి కుష్ఠ వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ఆడవారిలో కుష్ఠ రోగులు గుర్తించుటకు ఆశ వర్కర్లను, మగ వారిలో కుష్టు రోగాలను గుర్తించుటకు వాలంటీర్లకు బాధ్యతలు అప్పగించాలన్నారు. రానున్న జనవరి నుంచి జిల్లాలో ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో కుష్టు వ్యాధి నిర్మూలనకు సంబంధించిన ఇంటింటా సర్వే కార్యక్రమం అడ్డు రాకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కుష్ఠ ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డా. శారదా బాయి, డి ఎం ఓ డాక్టర్.చంద్రశేఖర్, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ సునీత, డాక్టర్ కాంతారావు నాయిక్, పారా మెడికల్ ఆఫీసర్ టి. విజయ్ కుమార్ ,డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్లు , టీ చంద్రశేఖర్ రెడ్డి , ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




# జగనన్న పాలనలో అడుక్కుతినే పరిస్థితులు.



ఆంధ్ర ప్రగతి డోన్ డిసెంబర్ 20:
డోన్ పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీల రాష్ట్ర వ్యాప్త నిరవధిక సమ్మె 9వ రోజు కొనసాగింది.బుధవారం స్థానిక ఎమ్మార్వో కార్యాలయం,పట్టణ పోలీస్ స్టేషన్,గాంధీ చౌక్,పాత బస్టాండ్,కంబాలపాడు సర్కిల్ తదితర ప్రాంతాల నందు అంగన్వాడీలు బిక్షాటన చేసి ప్రభుత్వంపై వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి టి.శివరాం,పట్టణ,మండల అధ్యక్షులు నకిశ్రీకాంత్,పి. రామాంజనేయులు,మండల కోశాధికారి బి.నాగమద్దయ్య, ప్యాపిలి మండల కార్యదర్శి చిన్న రహిమాన్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోయిలకొండ నాగరాజు,అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు రహమద్ బి,సుమలత, యశోద,నాగలక్ష్మి,గుల్జార్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో అంగన్వాడీలకు అడుక్కుతినే పరిస్థితులు దాపురించాయని 9 రోజుల నుండి సమ్మె చేస్తున్నా సమస్యలు పరిష్కరించకుండా రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా,దుర్మార్గంగా వ్యవహరిస్తూ అంగన్వాడి సెంటర్లను సచివాలయ సిబ్బందితో నడపాలని నిర్ణయించడం అన్యాయమని,సెంటర్లను సచివాలయాలకు అప్పగిస్తామంటే సహించమని పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.తాళాలు బద్దలు కొడితే సెంటర్లు నడవవని టీచర్లు,ఆయాలు ఉంటేనే సెంటర్లు నడుస్తాయన్న జ్ఞానోదయం ప్రభుత్వానికి త్వరలోనే బోధపడుతుంది అన్నారు.ప్రభుత్వమే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ప్రోత్సహించడం సిగ్గుచేటు అని,సమ్మె వల్ల కలిగే పర్యవసానాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని,ప్రభుత్వం రెచ్చగొట్టే చర్యలకు తక్షణమే స్వస్తి పలికి సమ్మెను సామరస్యంగా పరిష్కరించాలని,కార్మిక వర్గం కన్నెర్ర చేస్తే రాబోవు ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరవాలని హితవు పలికారు.



# జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు గురు రాజా స్కూల్ విద్యార్థులు ఎంపిక.

### -క్రీడాకారులను అభినందించిన గురురాజా పాఠశాల డైరెక్టర్ షేక్షావలి రెడ్డి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:
నంద్యాల పట్టణం గురు రాజా ఇంగ్లీష్ మీడియం స్కూలు క్రీడాకారులు జాతీయస్థాయి త్రోబాల పోటీలకు ఎంపికయ్యారు. జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను పాఠశాల డైరెక్టర్ పి షేక్షావల్లి రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా షేక్షావల్లి రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 10 నుంచి 12 వరకు నంద్యాల కేఎన్ఎం మున్సిపల్ స్కూల్లో ఎస్ జిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని తెలిపారు. పోటీల్లో అండర్ 14 విభాగంలో అక్షయ జ్యోతి, మణికంఠ, జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు కెఎన్ఎం మున్సిపల్ స్కూల్లో జరిగినటువంటి త్రోబాల్ పోటీలలో అండర్- 17 విభాగంలో కే.పాండురంగ రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీల్లో సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడంతో సంతోషంగా ఉందన్నారు. ఈనెల 20న పాఠశాల ఆవరణంలో రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్న క్రీడాకారులకు గురురాజా విద్యా సంస్థ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి మెడల్స్, ప్రశంస పత్రాలతో క్రీడాకారులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో త్రోబాల్ క్రీడలో విజయం సాధించేందుకు కోసం కృషి చేసిన వ్యాయామ ఉపాధ్యాయుడు సుబ్బారావును అభినందించారు.




# జగనన్న విదేశీ విద్యాదీవెవ- జగనన్న సివిల్ సర్వీసెస్ క్రింద రు.34.88 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ.

### -జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 20:
2023-24సంవత్సరానికి "జగనన్న విదేశీ విద్యా దీవెన" మరియు "జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం" పథకాల క్రింద 34.88 లక్షల రూపాయలు లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశామని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు.బుధవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసిస్తున్న అర్హులైన 390 మంది విద్యార్థులకు రూ.41.60 కోట్లను... సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 95 మంది, వారిలో తిరిగి మెయిన్స్‌లో ఉత్తీర్ణత సాధించిన 11 మంది అభ్యర్థులకు ప్రోత్సాహకంగా రూ.100.50 లక్షలను మొత్తం రూ.42.60 కోట్లను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి వారి ఖాతాల్లో జమ చేసే బృహత్తర వర్చువల్ కార్యక్రమాన్ని కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుండి జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి ఏపీ ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి చింతామణి, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీదేవి, మైనారిటీ సంక్షేమ అధికారులు విద్యార్థులు, విద్యార్థుల తలిదండ్రులు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ చదవగలిగే ప్రతిభ ఉండి కూడా పేదరికం, ఆర్థిక పరిస్థితుల కారణంగా విదేశాలలో చదువుకోలేని విద్యార్థులకు ప్రభుత్వం బాసటగా నిలుస్తోందన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలో 2023-24 సంవత్సరానికి "జగనన్న విదేశీ విద్యా దీవెన" పథకం క్రింద నలుగురు విద్యార్థులకు రూ.33.65 లక్షలు మరియు "జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం" క్రింద ఒక విద్యార్థికి లక్ష రూపాయలను లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని పేద విద్యార్థులు చక్కగా సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి ఉన్నత పదవులను అలంకరించాలని కలెక్టర్ వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు.

# ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు ఏర్పాట్లు చేయండి.

### -జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, డిసెంబర్ 20:




ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10 వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ సంబంధిత అధికారులకు సూచించారు.బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో సుబ్బారెడ్డి, జిల్లా కీడాప్రాధికార అధికారి రాజు తదితరులు పాల్గొన్నారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో టీమ్ ల ఫార్మేషన్ తక్షణమే పూర్తి చేసుకొని విజయవంతంగా క్రీడల పోటీలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే క్రీడా సామాగ్రి అన్ని మండలాలలోని సచివాలయాలకు చేరవేశామన్నారు మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ఆటస్థల మైదానాలను పరిశీలించి గుంతలు లేకుండా చదను చేసుకోవడంతో పాటు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. మారుతున్న జీవన శైలిలోని ఒత్తిడిలను దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల ద్వారా గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పోటీలను నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయిలో పాల్గొని గెలిచిన వారికి మండల స్థాయిలో, మండల స్థాయిలో గెలిచిన వారికి జిల్లా స్థాయిలో, జిల్లా స్థాయిలో గెలిచిన వారికి రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

# ఏపీలో ఇక కురుక్షేత్రమే.. జగన్ ఓడిపోవడం ఖాయం

త్వరలో అమరావతి, తిరుపతిలో సభలు నిర్వహించి.. టీడీపీ-జనసేన ఉమ్మడి ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలని నిర్ణయించినట్లు చంద్రబాబు వెల్లడించారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. 20 లక్షల మందికి ఉపాధి కల్పన బాధ్యత తీసుకుంటామన్నారు. అన్నదాత కార్యక్రమం ద్వారా ప్రతి రైతుకు ఆర్థిక సాయం చేస్తామని చెప్పారు.

అగ్రవర్ణాల పేదలను ఆర్థికంగా ఆదుకుంటామని చంద్రబాబు హామీ ఇచ్చారు. బీసీల రక్షణ కోసం చట్టం తీసుకొస్తామన్నారు. భవిష్యత్‌లో ఏయే కార్యక్రమాలు చేయాలనేదానిపై అధ్యయనం చేస్తామన్నారు. టీడీపీ-జనసేన పొత్తు ప్రకటించినప్పుడే వైసీపీ పని అయిపోయిందన్నారు. టీడీపీ-జనసేన పొత్తు చారిత్రక అవసరమని చంద్రబాబు పేర్కొన్నారు. మహిళలకు రక్షణ ఉండాలంటే.. వైసీపీ విముక్త రాష్ట్రంగా మారాలన్నారు. ఏపీలో జరుగుతున్న కురుక్షేత్ర యుద్ధంలో వైసీపీ ఓటమి ఖాయమని అభిప్రాయం వ్యక్తం చేశారు.వైసీపీ పాలనలో ఏపీ అంధకారం అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వాన్ని మార్చడం ద్వారా మన భవిష్యత్తును మనమే నిర్మించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కష్టాల్లో ఉన్నప్పుడు సాయంగా ఉండాలని అనుకున్నా: పవన్ కల్యాణ్

చంద్రబాబును అన్యాయంగా జైలులో పెడితే బాధ కలిగిందని, కష్టాల్లో ఉన్నప్పుడు సాయంగా ఉండాలని మద్దతు ఇచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. నారా లోకేశ్ 'యువగళం-నవశకం' ముగింపు సభలో పవన్ మాట్లాడారు. తాను ఏదో ఆశించి టీడీపీకి మద్దతివ్వలేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 2024లో టీడీపీ-జనసేన ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని పవన్ పేర్కొన్నారు. మార్పు తీసుకువస్తాం, జగన్‌ను ఇంటికి పంపుతామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. జగన్ ఎమ్మెల్యేలను మార్చుతున్నారని, మార్చాల్సింది ఎమ్మెల్యేలను కాదు, సీఎం జగన్‌ను మార్చాలని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యం అనే పదానికి జగన్‌కు విలువ తెలియదని, ఏదైనా మాట్లాడితే దూషిస్తారు, దాడులు చేయిస్తారని పవన్ ఆరోపించారు. తల్లి, చెల్లికి విలువ ఇవ్వని వ్యక్తి, ఆడపడుచులకు ఏం గౌరవం ఇస్తారంటూ పవన్ ఎద్దేవా చేశారు. వైసీపీ నేతలకు ప్రజాస్వామ్యంపై గౌరవం లేదని, కొండలు, కోణలను సైతం ఆక్రమిస్తున్నారని పవన్ వెల్లడించారు. మరో సారి వైసీపీ ప్రభుత్వం వస్తే ఎవరూ ఇళ్లలో ఉండని పరిస్థితులు నెలకొంటాయని పేర్కొన్నారు. మరో సారి ప్రభుత్వం వస్తే రాష్ట్రానికి పెట్టుబడులు రావు, ఉపాధి కల్పన



జరగదని పవన్ వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వం మారాల్సిన అవసరం ఉందన్న పవన్, వైసీపీ వ్యతిరేక ఓట్లు ఒకే వేదికపైకి రావడం సంతోషకరమని తెలిపారు. వైసీపీ వ్యతిరేక ఓట్లు చీలనివ్వనని పవన్ వెల్లడించారు. వైసీపీ పాలనలో ఏపీ అంధకారం అవుతుందన్న పవన్, మన భవిష్యత్తును మనమే నిర్మించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

కర్రో, కత్తో పట్టుకోవాల్సి వస్తుంది: ఏపీ భవిష్యత్తు నిలదొక్కుకునే వరకు పొత్తు ఉండాలని పవన్ పేర్కొన్నారు. టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో రూపొందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీతో కలిసి సంయుక్తంగా కార్యక్రమాలు రూపొందిస్తామని పవన్ వెల్లడించారు. త్వరలోనే తమ భవిష్యత్తు కార్యాచరణను విడుదల చేస్తామని పేర్కొన్నారు. ఏపీ భవిష్యత్తు నిర్మాణానికి పొత్తు ఉండాలని, అందు కోసం టీడీపీ - జనసేన మైత్రి సుదీర్ఘంగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ తెలిపారు. వైసీపీ గూండాలను ఎదుర్కోవటానికి కర్రో, కత్తో పట్టుకోవాల్సి వస్తుందని కేంద్రంలోని పెద్దలకు చెప్పానని పవన్ వెల్లడించారు. తెలుగుదేశంతో పొత్తు తప్ప మరో ప్రత్యామ్నాయం లేదని బీజేపీ నేతలకు వివరించినట్లు పేర్కొన్నారు. తమకు కేంద్రంలోని బీజేపీ పెద్దల మద్దతు ఉంటుందని ఆశిస్తున్నట్లు పవన్ తెలిపారు. ఏపీ నిలదొక్కుకునే వరకూ, పొత్తు సాధ్యమైనంత ఎక్కువకాలం కొనసాగాలని ఆశించారు.

ఏపీకి రావాలంటే పరిస్థితులు: ఏపీలో పని చేయాలంటే ఐఏఎస్, ఐపీఎస్? అధికారులు బయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో వైసీపీ నేతల అరాచకాలు పెరిగిపోయాయని, ప్రశ్నిస్తే దాడులు, బెదిరింపులకు పాల్పడుతున్నారని వెల్లడించారు. ఏపీకి రావాలంటే పరిశ్రమలు బయపడే పరిస్థితులు నెలకొన్నాయని పవన్ పేర్కొన్నారు. తానకు సైతం లోకేశ్? పాదయాత్ర చేయాలని ఉందని, వీలుకాని పరిస్థితులు నెలకొన్నాయని పవన్



తెలిపారు. అయితే, లోకేశ్ ప్రజల మస్యలు వింటూ ముందుకు సాగుతూ యవగళం పాదయాత్ర పూర్తి చేశారని పవన్ తెలిపారు.యువగళం-నవశకం సభలో ఆయన మాట్లాడారు.

"ప్రజలు పాదయాత్ర చేస్తే పోరాటం అవుతుంది. రాక్షస పాలనలో పోరాటం చేస్తే విప్లవం అవుతుంది. యువగళం.. మనగళం.. ప్రజాగళం. జగన్‌ది రాజారెడ్డి రాజ్యాంగం పొగరు. లోకేశ్‌ది అంబేడ్కర్ రాజ్యాంగం పౌరుషం. యువగళం ముగింపు సభ కాదు.. ఆరంభం మాత్రమే. చంద్రబాబు, పవన్‌ను చూస్తే జగన్ భయపడతారు. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలుకు పంపించారు. విజనరీ అంటే చంద్రబాబు.. ప్రిజనరీ అంటే జగన్. జగన్ అరెస్టు అయితే రోజుకో స్కాము బయటపడేది. ప్రజాస్వామ్యాన్ని జగన్ దెబ్బతీశారు. రూ.లక్ష కోట్లు దోచేసిన వ్యక్తి పేదవాడు అవుతారా? జగన్ అహంకారం.. ప్రజల ఆత్మగౌరవానికి మధ్య యుద్ధం జరుగుతోంది. మూడు నెలల్లో ప్రజాస్వామ్యం పవర్ ఏంటో చూపాలి.

ఆడుదాం ఆంధ్రా అంటూ కొత్త పథకం తెచ్చారు. మా జీవితాలతో ఆడారని ప్రజలు చెబుతున్నారు. జగన్ ఐపీఎల్ టీమ్ పేరు కోడికత్తి వారియర్స్. కోడికత్తి వారియర్స్ ఆటగాడు అవినాష్‌రెడ్డి. బెట్టింగ్ స్టార్ అనిల్ యాదవ్.. అరగంట స్టార్ అంబటి. గంట స్టార్ అవంతి.. ఆల్ రౌండర్ గోరంట్ల మాధవ్. రీల్ స్టార్ భరత్.. పించ్ హిట్టర్ బియ్యపు మధుసూదన్‌రెడ్డి. యువగళం పాదయాత్ర ఎన్నో పాఠాలు నేర్పింది.

అడుగడుగునా జగన్ విధ్వంసం కనిపించింది. రాజధానిని చంపి జగన్ రాక్షసానందం పొందారు. గాడి తప్పిన రాష్ట్రాన్ని సరైన గాడిలో పెడతాం" అని లోకేశ్ వివరించారు. లోకేశ్ యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా 'యువగళం-నవశకం' పేరుతో తెదేపా భారీ బహిరంగ సభ నిర్వహించింది. విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గం పోలిపల్లి వద్ద ఏర్పాటు చేసిన సభకు రాష్ట్ర నలుమూలల నుంచి తెదేపా, జనసేన శ్రేణులు భారీగా తరలివచ్చారు.వైసిపి ప్రభుత్వం, సీఎం జగన్ పై నిప్పులు చెరిగారు టీడీపీ ఎమ్మెల్యే, నటుడు నందమూరి బాలకృష్ణ. సీఎం జగన్ అన్ని రకాలుగా రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారని బాలకృష్ణ మండిపడ్డారు.రానున్న ఎన్నికల్లో వైసీపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని బాలకృష్ణ పిలుపునిచ్చారు. వైసీపీలో సామాజిక న్యాయం లేదన్నారు.

"ఇది యువగళం ముగింపు సభ కాదు. ఇది ఆరంభం మాత్రమే. నవతరం రాజకీయాలకు ఆరంభం. యువగళం పాదయాత్రను అడ్డుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశారు. నటులు కేవలం సినిమాలకే పరిమితం కాదు. పవన్ కల్యాణ్ ను సినిమాల్లో కంటే ప్రజల్లో ఎక్కువ చూస్తున్నాము. ఎన్టీ రామారావు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు. పేదవాడి ఆకలికి అండగా ఉన్నారు. రామారావు ప్రజలు గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయారు. రాజధాని లేని చెత్త ప్రభుత్వం వైసీపీ. గంజాయి సాగులో ఏపీ మొదటి స్థానంలో ఉంది. ఈ రాష్ట్రాన్ని ఓ సైకో పరిపాలన చేస్తున్నాడు.

ఏ రుణం పెట్టుకోకూడదు అని నాన్న గారు చెప్పేవారు. ప్రజల రుణం తీర్చుకుంటాం. చంద్రబాబు దూరదృష్టితో ఎన్నో అభివృద్ధి పథకాలు తీసుకొచ్చారు. దేశంలోనే తొలిసారిగా పొదుపు స్కీమ్ తీసుకొచ్చారు. ఆనాడు అందరికీ ఉపాధి లభించింది. మహిళా సాధికారత సాధ్యమైంది. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు సామాన్యులను ఎంతో మంచి చేశాయి. ఎన్టీఆర్ అడుగుజాడల్లో చంద్రబాబు నడుస్తున్నారు. ప్రపంచానికి, ఒక విజన్ కు ఆదర్శం చంద్రబాబు. కనకపు సింహాసనంపై శునకంలా రాష్ట్రంలో సైకో పాలన సాగుతోంది. నవశకం.. అంతం కాదిది ఆరంభం. జగన్ ప్రభుత్వంపై పోరాటానికిక సమయం లేదు, విజయమో వీరస్వర్గమో తేల్చుకోవాల్సిందే. నూతిలో కప్పలా, తాడేపల్లి ప్యాలెస్ తన సర్వస్వం అని జగన్ అనుకుంటున్నారు. వైసీపీ అక్రమాలకు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ప్రజా సమస్యలపై పవన్ కల్యాణ్ పోరాటం అభినందనీయం. ఎన్టీఆర్ తెలుగు జాతి గౌరవం పెంచితే, చంద్రబాబు తెలుగు ప్రజల్లో విశ్వాసం పెంచారు. పవన్ కల్యాణ్, నేను.. ఇద్దరం ముక్కుసూటి మనుషులమే. ఇకపై విజృంభిస్తాం.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యం అంటున్న పవన్ కల్యాణ్.. నేర్చుకోవాల్సింది ఏమిటి? సరిదిద్దుకోవాల్సింది ఏమిటి? రాష్ట్ర భవిష్యత్ మీ చేతుల్లో ఉంది. సమయం లేదు మిత్రమా. విజయమా వీర స్వర్గమా అనే పరిస్థితి ఉంది. అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు జగన్. ఉపాధి లేక ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలసలు వెళ్తున్నారు. సమ్మిట్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారు. ఉచిత పథకాల మోజులో ప్రజలు పడొద్దు" అని బాలకృష్ణ అన్నారు



## ఆక్సిఫోర్డ్ స్కూల్స్ 25వ అనుయల్ స్పోర్ట్స్ మీట్‌లో కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

ధి, శేరిలింగంపల్లి:

రామచంద్రపురం బిహెచ్ఇఎల్ లోగల హాకీ గ్రౌండ్ లో ఏర్పాటుచేసిన ఆక్సిఫోర్డ్ ఐఐటి, మెడికల్ ఫౌండేషన్ స్కూల్స్ తారానగర్ బ్రాంచ్ వారు ఏర్పాటుచేసిన 25వ స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. వారితో పాటుగా శేరిలింగంపల్లి విలేజ్ డెవలప్మెంట్ కమిటి ప్రెసిడెంట్ గడ్డం రవి యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆక్సిఫోర్డ్ స్కూల్ విద్యార్థులు ముఖ్య అతిథులుగా విచ్చేసిన కార్పొరేటర్ ని మార్చ్ ఫస్ట్, గౌరవ వందనం చేస్తూ వేదిక మీదకు సాధరంగా స్వాగతించారు. అనంతరం కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ స్పోర్ట్స్ మీట్ ను (ఒలింపిక్) ఫైర్ ను వెలిగించి, బలూన్స్ ను ఆకాశానికి విడిచి అంగరంగ వైభవంగా ప్రారంభించారు. స్పోర్ట్స్ మీట్ లో భాగంగా రన్నింగ్ రేస్ లో మొదటి మూడు స్థానాల్లో విజేతలుగా గెలుపొందిన విద్యార్థులకు కార్పొరేటర్ గారు గోల్డ్ మెడల్స్ ను ప్రధానం చేశారు. రాగం నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ స్పోర్ట్స్ మీట్ లో పాల్గొని విద్యార్థులతో ప్రతిఒక్క విద్యార్థి కి చదువుతో పాటుగా స్పోర్ట్స్ చాలా ముఖ్యమని అన్నారు. విద్యార్థులందరు క్రమశిక్షణతో ఉండి చక్కగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నతమైన శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్ ని ఘనంగా శాలువాతో సత్కరించి, మెమెంటో ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్ కే మాలిన్, రీజినల్ ఇంచార్జి ఆరోగ్య రెడ్డి, మానేజ్మెంట్ స్టాఫ్ బార్బర మెహెతా, ప్రీ ప్రైమరీ ఇంచార్జి నస్రీన్, ప్రైమరీ ఇంచార్జి స్వాతి, సీనియర్ ఇంచార్జి ప్రశాంతి, కొయ్యాడ లక్ష్మణ్ యాదవ్, అజీమ్, సుభాష్ రాథోడ్, విద్యార్థులు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలపై పోరాటం పిడిఎస్ యు

ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణం లో స్థానిక బాలికల జూనియర్ కళాశాల నందు పి డి ఎస్ యు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి రవి పిడిఎస్ యు తాలూకా అధ్యక్షులు సుమాల సురేష్ మరియు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళా రాయలసీమ అధ్యక్షులు భారతమ్మ లు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ కళాశాల యందు సౌకర్యాలు గురించి పార్టీ పుస్తకాల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వము నాడు నేడు కార్యక్రమంలో భాగంగా కళాశాల యందు జరుగుతున్న పనులను పరిశీలించారు విద్యార్థులతో మాట్లాడుతూ మీకు ఎటువంటి సమస్యలు ఉన్న మాకు తెలియజేయాలని వాటిపై మేము మీ కొరకు ఎంతకైనా పోరాటం చేసి వాటిని పరిష్కరించే బాధ్యత మేము తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. అదేవిధంగా కాలేజీలో జరిగేటువంటి విషయాల పైన సమస్యల పైన వారికి పరిష్కారం కోసం కాలేజీలో కూడా పిడిఎస్యు ఒక కమిటీ ఉంటే బాగుంటుందని తెలిసేగా ఉత్సాహంతో బాలికలు నాయకత్వం వహించడానికి ముందుకు వచ్చారు భారతమ్మ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ బాలికలైన మీరు చిన్న వయసులో ఉన్నారు. ఈ వయసులోనే మనము చదవపట్ల మంచి జ్ఞానం పెంచుకొని జీవితంలో భావిభారత పౌరులుగా తీర్చబడేటట్లు మనము ఈ స్థాయినించే బాగా కష్టపడి చదువుకోవాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిఎస్యు నాయకులతోపాటు కళాశాల హెచ్ఇసి సిఇసి బైపీసీ ఎంపీసీ గ్రూపుల విద్యార్థులు పాల్గొన్నారు



## కాలభైరవ స్వామివారికి బండి రమేష్ ప్రత్యేక పూజలు

కూకట్ పల్లి:

బాలానగర్ డివిజన్ పరిధిలోని శ్రీ శివ పంచాయాతన సహిత శ్రీ కాలభైరవ స్వామివారి 22వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలభైరవుని పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని బండి రమేష్ కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, ఫతేనగర్ డివిజన్ కాంటెస్టడ్ కార్పొరేటర్ కుక్కల రాజు ముదిరాజ్, మేడ్చల్ జిల్లా ఏస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ మధు మోహన్, ఏ బ్లాక్ ఏస్సీ డిపాటిమెంట్ ప్రెసిడెంట్ బందీగా బాలనర్సింహ, మేడ్చల్ డిస్ట్రిక్ట్ ఫిషేర్మన్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల నరేందర్, బాలానగర్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన్న, జనరల్ సెక్రెటరీ మహేందర్, వైస్ ప్రెసిడెంట్స్ మాదరి శ్రీనివాస్, బాలరాజు, ఆలయ కమిటీ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎగ్జిబిషన్ కార్యక్రమాన్ని సందర్శించిన మసూద్

, కుత్బుల్లాపూర్:

కుత్బుల్లాపూర్ సహస్ర స్మార్ట్ హై స్కూల్ జివిస్ రాజు ప్రిన్సిపాల్ రజని కుమారి అద్వర్యంలో సైన్స్ అండ్ మ్యాథ్స్ ఎగ్జిబిషన్ ను ఘనంగా నిర్వహించారు. చిన్నరుల చేసిన ప్రాజెక్టులు అందరిని ఆకర్షించుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శివరాత్రి యాదగిరి, బిఆర్ఎస్ ఎంఎ అధ్యక్షుడు మేడ్చల్ జిల్లా, శ్రీనివాస చారి బిఆర్ఎస్ ఎంఎ అధ్యక్షుడు, కుత్బుల్లాపూర్, కోశాధికారి శ్రీకాంత్, వార్డు సభ్యులు మసూద్, అజయ్ గుప్తా, తౌసిఫ్ క్వాద్రీ, బిఆర్ఎస్ ఎంఎ, కార్యవర్గ సభ్యులు, పాఠశాల అధ్యాపకులు, నాలుగు పాఠశాల విద్యార్థులు, మరియు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



## సంక్షేమ రాజ్యం సృష్టికర్త సీఎం జగన్'...

– ఎమ్మెల్యే శిల్పారవి రెడ్డి.

ంధ్ర ప్రగతి నంద్యాల డిసెంబర్ 20:

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 37 వ వార్డు నందమూరి నగర్ లో 196 వరోజు కౌన్సిలర్ శంషిద్ వార్డు ఇంచార్జ్ యూసఫ్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం లో ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పాల్గొన్నారు ముందుగా వార్డ్ వైసిపి నాయకులు ఎమ్మెల్యేకు గజమాలతో స్వాగతం పలికి పూలవర్షం కురిపించారు అనంతరం లబ్ధిదారులకు సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు కావాలంటే మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావాలని ప్రతి ఒక్కరూ నిండు మనసుతో ఆశీర్వదించాలని ప్రజలను ఎమ్మెల్యే కోరారు.ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం అభివృద్ధి గతంలో కొంటే ఇప్పుడు పెద్ద ఎత్తున జరుగుతున్నాయని అది చూసిన తెలుగుదేశం నాయకులు అభివృద్ధి జరగలేదంటూ తప్పుడు ప్రచారాలు చేయడం మొదలు పెట్టారని ఎన్ని కుయుక్తులు చేసిన ప్రజల ను మోసం చేయలేరని తెలుగుదేశం నాయకులకు ఎలక్షన్ల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తుకొస్తారని ప్రజలు కష్టాలలో ఉన్నప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు మాత్రం ఓట్ల కోసం గంపలు గంపలుగా తప్పుడు హామీలను గుప్పిస్తూ ప్రజలను మోసం చేయడానికి వస్తున్నారని ప్రజలు వారిని నమ్మాల్సిన పనిలేదని పేదల కు మంచి చేస్తు ఇచ్చిన ప్రతి మాటను నెరవేరిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని వచ్చే ఎన్నికలలో మరోసారి వైఎస్ఆర్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబునిసా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి,ఆప్కో డైరెక్టర్ సుబ్బారాయుడు ,నంద్యాల మూడవ పట్టణ అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ ,సాంస్కృతిక జిల్లా అధ్యక్షులు టివి రమణ, ఆటోనగర్ ప్రెసిడెంట్ జాకీర్, నంద్యాల మండలం సచివాలయ కన్వీనర్ బసవేశ్వర్ రెడ్డి ,వార్డు వైసిపి నాయకులు అస్లాం ,మాలిక్, వసింఖాన్ ,సర్దార్, లింగమయ్య ,కుమార్ ,వైసీపీ కౌన్సిలర్స్ కలాం భాష, బషీద్ కోఆప్షన్ సభ్యులు సలాంముల్లా వైసీపీ నాయకులు పార్థుడు, రహంతుల్లా, జలీల్, గన్ని కరీం, అమీర్,చిపింగ్ బ్రదర్స్ గిరిజన ప్రజా సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రెవిన్యూ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.